క్లుప్తంగా

8, 9 తేదీల్లో క్రీడా ఎంపికలు



మాట్లాడుతున్న ఎంఈఓ అరుణ్‌కుమార్

ఏలూరు(ఆర్‌ఆర్‌పేట) : ఏలూరు మండల లెవెల్, అర్బన్, రూరల్‌లో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో స్కూల్ గేమ్స్ ఫెడేషన్ ఎంపికలు నిర్వహించనున్నట్టు ఎంఈఓ అరుణ్ కుమార్ తెలిపారు. శనివారం శనివారపుపేట జెడ్పీహెచ్‌ఎస్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 8, 9 తేదీల్లో ఎస్‌జీఎఫ్ మండల, అర్బన్ స్థాయి ఎంపికలు నిర్వహిస్తామని తెలిపారు. కబడ్డీ, కోకో, వాలీబాల్, బ్యాడ్మింటన్, చెస్, యోగ, అథ్లెటిక్స్ తదితర విభాగాల్లో అండర్-14 బాలురు, బాలికలు, అండర్-17 బాలురు బాలికలకు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జి.ప్రకాష్, మండల కోఆర్డినేటర్ పి.పద్మలత, ఫిజికల్ ఎడ్యుకేషన్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ రమేష్, దుర్గాప్రసాద్, సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు మురళి పాల్గొన్నారు.

9న ఏలూరులో జాబ్ మేళా

ఏలూరు (టూటౌన్): జిల్లా ఉపాధి కల్పనా కార్యాలయం, నేషనల్ కెరీర్ సర్వీసు, సెట్ వెల్ ఏలూరు వారి సంయుక్త ఆధ్వర్యములో ఈ నెల 9న సెట్‌వెల్ కార్యాలయం, కలెక్టరేట్ కాంపౌండ్, ఏలూరులో నిరుద్యోగ యువతకు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి వి.వరలక్ష్మి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీ సిటీలోని కాడ్బరీ కంపెనీ ప్రతినిధులు హాజరుకానున్నారన్నారు. అభ్యర్థులు తప్పనిసరిగా ఫార్మల్ డ్రెస్‌లో రెజ్యూమ్, సంబంధిత ధ్రువపత్రాలతో హాజరుకావాల్సి ఉంటుందన్నారు. ఇతర వివరాలకు 8886882032 నెంబరులో సంప్రదించవచ్చన్నారు.

పోరుబాట కరపత్రాల పంపిణీ



సమస్యలపై నినదిస్తున్న ఉపాధ్యాయులు

ఏలూరు (టూటౌన్): ఈ నెల 7న విజయవాడ ధర్నా చౌక్‌లో నిర్వహించే ధర్నాకు పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులు హాజరు కావాలని ఫ్యాప్టో నాయకులు పిలుపు నిచ్చారు. శనివారం భోజనం విరామ సమయంలో ఫ్యాప్టో ఆధ్వర్యంలో అక్టోబర్ 7న చలో విజయవాడ పోరుబాట కరపత్రాలు, పోస్టర్లను ఏలూరు రూరల్ మండలంలోని చాటపర్రు, మాదేపల్లి, జాలిపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయులకు అందజేశారు. ఫ్యాప్టో జిల్లా చైర్మన్ జి.మోహన్, ప్రధానోపాధ్యాయ సంఘం అధ్యక్షుడు వి.మురళీకృష్ణ, మండల ఫ్యాప్టో నాయకులు వి.జేసుదాసు తదితరులు పాల్గొన్నారు.

నేరాలకు పాల్పడితే కఠిన శిక్షలు

- మహిళలపై నేరాల్లో విచారణ వేగవంతం
- 2024 - 25లో 17 కేసుల్లో 24 మందికి జీవిత ఖైదు
- 2022 - 23లో 8 కేసుల్లో 12 మందికి జీవిత ఖైదు





కోర్టుమానిటరింగ్ సెల్ సమీక్షలో పాల్గొన్న ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్, సమావేశంలో పాల్గొన్న కోర్టు మానిటరింగ్ సెల్ సిబ్బంది

ఏలూరు టౌన్: మహిళలు, యువతులు, బాలికలపై నేరాలకు పాల్పడితే కఠిన శిక్షలు విధించేలా చర్యలు చేపట్టారు. హత్యలు, అత్యాచారాలు, లైంగిక వేధింపులు, దాడులు, దౌర్జన్యాలు పెచ్చుమీరుతోన్న తరుణంలో బాధితులకు న్యాయం చేసేలా, నిందితులకు కఠిన శిక్షలు విధించేలా ఏలూరు జిల్లా పోలీస్ శాఖ తనదైన శైలిలో పనిచేస్తోంది. ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ ప్రత్యేక చొరవతో కోర్టు మానిటరింగ్ సెల్ ఏర్పాటు చేశారు. ఎస్పీ పర్యవేక్షణలో ప్రతి శనివారం సమీక్షిస్తూ సత్ఫలితాలు సాధించేలా చర్యలు చేపడుతున్నారు. మహిళలపై నేరాలకు పాల్పడితే న్యాయస్థానాల్లో కఠిన శిక్షలు పడేలా పోలీస్ అధికారులు, సిబ్బంది కృషి చేస్తుండగా, న్యాయస్థానాలు కీలక తీర్పులు వెలువరిస్తూ బాధితులకు ఊరట, నిందితులకు శిక్షలు ఖరాలు చేయటం విశేషం.

భయం పుట్టేలా శిక్షలు

మహిళలపై నేరాలకు పాల్పడాలంటే భయపడేలా శిక్షలు పడేలా ప్రత్యేకంగా స్పీడ్ ట్రయల్ చేపడుతున్నారు. బాధిత మహిళలకు సత్వర న్యాయం చేసే దిశగా అడుగులు వేస్తున్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలోనే ఈ విధానానికి నాంది పలికారు. 2023 జూన్ 13న ఏలూరు గ్రేవియర్ నగర్‌లో యడ్ల ఫ్రాన్సిక అనే మహిళ యాసిడ్ దాడిలో తీవ్రగాయాలతో మృత్యువుతో పోరాడి చనిపోయింది. ఇదే కేసును సీరియస్‌గా తీసుకున్న ఏలూరు ఐజీ జీవీజీ అశోక్ కుమార్, అప్పటి ఎస్పీ మేరీ ప్రశాంతి నిందితులను 24 గంటల్లో అరెస్ట్ చేయటమే కాకుండా, 21 రోజుల్లో ఛార్జ్‌షీట్‌ను కోర్టులో దాఖలు చేయటం, 117 రోజుల్లోనే ముగ్గురు నిందితులకు మూడేసి యావజ్జీవ ఖైదు విధించేలా చేశారు.

శిక్షలు ఇలా..

- ఏలూరు జిల్లాలో జీవితఖైదు, 20 ఏళ్లకు పైగా శిక్షలు విధిస్తూ న్యాయస్థానాలు తీర్పులు ఇచ్చాయి.
- 2024 - 25లో ప్రధానంగా 31 కేసుల్లో 38 మంది నిందితులకు కఠిన శిక్షలు ఇలా..
- 17 కేసుల్లో 24 మందికి జీవితఖైదు విధించారు.
- 3 కేసుల్లో ముగ్గురికి 20 ఏళ్ల ఖైదు విధిస్తూ తీర్పు
- 7 కేసుల్లో ఏడుగురుకి 10 ఏళ్ల ఖైదు విధింపు
- రెండు కేసుల్లో ఇద్దరికి 7 ఏళ్ల, ఖైదు
- రెండు కేసుల్లో ఇద్దరికి 5 సంవత్సరాల ఖైదు
- 2022 - 23 సంవత్సరంలో ప్రధానంగా 14 కేసుల్లో 18 మంది నిందితులకు కఠిన శిక్షలు విధించారు
- 8 కేసుల్లో 12 మందికి జీవిత ఖైదు, శిక్షల విధించారు
- మూడు కేసుల్లో ముగ్గురుకి 10 ఏళ్ల ఖైదు విధిస్తూ తీర్పు
- ఒక కేసులో నిందితుడికి 7 ఏళ్ల ఖైదు
- రెండు కేసుల్లో ఇద్దరికి ఐదేళ్ల ఖైదు విధిస్తూ తీర్పు

కోర్టు మానిటరింగ్ సెల్ భేష్

ఎస్పీ కేపీ శివకిషోర్ నిందితులకు త్వరితగతిన కఠిన శిక్షలు పడేలా చేయటంలో తనదైన ముద్ర వేసుకున్నారు. కోర్టు మానిటరింగ్ సెల్ ఏర్పాటు చేసి, ప్రతి శనివారం సమీక్షిస్తూ నేరస్తులు తప్పించుకోకుండా పగడ్బందీగా సాక్షులను న్యాయస్థానాల ముందు ప్రవేశపెట్టటం, సాక్ష్యాధారాలు సేకరించటంలో సఫలీకృతులు అవుతున్నారు. 2024 - 25లో ఏలూరు జిల్లాలో ఏకంగా 38 మంది నిందితులకు కఠిన శిక్షలు పడేలా చేశారు. జిల్లాలోని ప్రతి పోలీస్ స్టేషన్ నుంచి కోర్టు కానిస్టేబుల్స్, హెడ్ కానిస్టేబుల్స్‌ను నియమించి, కేసుల ప్రగతిని నిత్యం పర్యవేక్షించేందుకు ఏలూరు మహిళా స్టేషన్ సీఐ ఎం సుబ్బారావును ఇన్‌చార్జిగా నియమించారు.

బాధితులకు న్యాయం



ఎస్పీ కేపీ శివకిషోర్ ప్రత్యేక శ్రద్ధతో కోర్టు మానిటరింగ్ సెల్‌ను బాధితులకు త్వరితగతిన న్యాయం చేయటంతోపాటు, నేరాలకు పాల్పడిన వ్యక్తులు చట్టం నుంచి తప్పించుకోకూడదనే లక్ష్యంతో ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా ఆయా కేసులను నిత్యం సమీక్షిస్తూ, న్యాయస్థానాలకు చట్టానికి లోబడి సాక్ష్యాధారాల సేకరణ, సాక్షులను ప్రవేశపెట్టటం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగిస్తూ కేసులను పరిష్కరించటంలో సూచనలు, ఆదేశాలు జారీ చేస్తున్నారు. ఆయన చొరవతోనే 2024 - 25లో ఏకంగా ముగ్గురికి 20 ఏళ్ల ఖైదు, 24మందికి జీవిత ఖైదులు విధించేలా చర్యలు చేపట్టాం.

– ఎం.సుబ్బారావు, కోర్టుమానిటరింగ్ సెల్ ఇన్‌చార్జి, సీఐ

సకాలంలో సిలబస్ పూర్తి చేయాలి



గణపవరంలో సెమిస్టర్-2 పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంఈఓ బాలయ్య

గణపవరం: నిర్ణీత సమయానికి సిలబస్ పూర్తి చేసి విద్యార్థులను ఎఫ్‌ఏ-2 పరీక్షలకు సిద్ధం చేయాలని గణపవరం ఎంఈవో గొర్రెల బాలయ్య అన్నారు. శనివారం గణపవరంలోని వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సెమిస్టర్-2 పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెలాఖరులోగా సెమిస్టర్-1 సిలబస్ పూర్తి చేయాలన్నారు. వెంటనే సెమిస్టర్-2 పాఠ్యాంశబోధన చేపట్టాలని, ఎఫ్‌ఏ-2, ఎస్‌ఏ-1, పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం వీరవేణి, సీఆర్‌పీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

దెందులూరు: మండలంలోని మసీదుపాడు గ్రామానికి చెందిన కే.సువర్ణరాజు తీవ్ర అనారోగ్యం బాధపడుతుండటో 2000 సంవత్సరం పదో తరగతి పూర్వ విద్యార్థులు మేమున్నామంటూ రూ.56 వేలు ఆర్థిక సాయం అందించారు. ప్రమాదవశాత్తు ఇటీవల సువర్ణరాజు మృతి చెందాడు. మరోసారి మిత్రులందరూ సువర్ణ రాజు కుటుంబ సభ్యులకు నగదు, నెలవారి సరుకులు శనివారం రాంబాబు వారి నివాసంలో కుటుంబ సభ్యులకు అందజేశారు.

అంతర్ జిల్లాల బదిలీల్లో ముగ్గురు టీచర్ల చేరిక



టీచర్‌కు ఉత్తర్వులు అందిస్తున్న ఎంఈఓ

భీమడోలు: అంతర్ జిల్లాల బదిలీల్లో భీమడోలు మండలానికి ముగ్గురు టీచర్లు శనివారం చేరారు. మండలంలోని భీమడోలు నెం.1, నెం.3, గుండుగొలను నెం.1 పాఠశాలలను ఆ ముగ్గురు మహిళా టీచర్లు కోరుకున్నారు. కౌన్సెలింగ్‌లో కేటాయించిన పాఠశాలల్లో చేరాలని వారికి ఉత్తర్వులను అందించారు. శనివారం భీమడోలు ఎంఆర్సీలో భీమడోలు ఎంఈవో 1 ఈదుపల్లి శ్రీనివాసరావు వారికి ఉత్తర్వులను అందించారు. విద్యార్థులకు చక్కని విద్యాబోధన చేయాలని, మండలానికి మంచి గుర్తింపు తేవాలని ఆయన వారికి సూచించారు. మండలంలోని పదవీ విరమణ వల్ల ఖాళీగా ఉన్న ఈ మూడు స్థానాలను భర్తీ చేయడం జరిగిందన్నారు. ఇంకా మండలంలో మల్లరం, కొండ్రెడ్డినగర్, పూళ్ల నెం.2 పాఠశాలల్లో ఒకొక్క పోస్టు చొప్పున ఖాళీగా ఉన్నాయని, వారిని డీఎస్సీలో ఎంపికైన టీచర్లతో భర్తీ చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు.

నాడు నిధులు పుష్కలం.. నేడు నిర్లక్ష్యం

- కలగా గుండేరు వాగుపై వంతెన నిర్మాణం
- వైఎస్సార్ సీపీ హయాంలో రూ.5.5 కోట్లు కేటాయింపు
- నేడు పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- రెండు మండలాల ప్రజలకు ఇబ్బందులు

కామవరపుకోట: మండలంలోని కళ్ల చెరువు సమీపంలోని గుండేరు వాగుపై వంతెన నిర్మాణం కలగా మారింది. వైఎస్సార్‌సీపీ హయాంలో యుద్ధ ప్రాతిపదిగిన ఈ వంతెన నిర్మాణానికి రూ.5.5 కోట్లు కేటాయించారు. ఇలాగో ఎన్నికలు రావడం కూటమి పార్టీలు అధికారంలోకి రవడంతో ఈ వంతెన నిర్మాణాన్ని గాలికి వదిలేశారు. ఈ వంతెన నిర్మాణం చేపట్టే వరకు బ్రిడ్జి డైవర్షన్ రోడ్డు నిర్మాణానికి రూ.20 లక్షలు మంజూరయ్యాయి. ఐనా నేటికీ వంతెన, డైవర్షన్ రోడ్డు నిర్మాణం చేపట్టలేదు.

కుంగిన వంతెన

లింగపాలెం మండలం ఆశన్నగూడెం సమీపంలో, కామవరపుకోట మండలం కళ్లచెరువు సమీపంలో రెండు మండలాలను కలిపే గుండేరు వాగుపై ఉన్న వంతెన కుంగిపోయింది. ఈ వంతెనపై ప్రయాణం ప్రమాదకరంగా మారింది. ఈ వంతెన మీదుగా రైతులు మొక్కజొన్న, పామాయిల్, కోకో, నిమ్మ వంటి అనేక రకాల వ్యవసాయ ఉత్పత్తులను ఫ్యాక్టరీలకు, వ్యాపార సంస్థలకు తరలించేవారు. ఇటీవల వర్షాలు, వరదల కారణంగా వంతెన పూర్తిగా కుంగిపోయింది. దీంతో వాహనచోదకులు, రైతులు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి వెంటనే గుండేరు వాగుపై వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



వర్షాలకు కుంగిన గుండేరు వాగు వంతెన

నిర్మాణం చేపట్టాలి



కామవరపుకోట, లింగపాలెం మండలాల ప్రజలు నిత్యం ఈ వంతెన పై నుంచి రాకపోకలు సాగిస్తుంటారు. ఆ వంతెన గత కొన్నేళ్లుగా శిథిలావస్థకు చేరటంతో ఆయిల్ పామ్, అరటి, నిమ్మ వంటి వ్యవసాయ ఉత్పత్తుల తరలింపునకు రైతులు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ ఏడాది కురిసిన వర్షాలతో వంతెన పూర్తిగా కుంగిపోయింది. అధికారులు స్పందించి నిధులు కేటాయించి త్వరగా వంతెన నిర్మాణం చేపట్టాలి.

– కంభం విజయరాజు, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కన్వీనర్, చింతలపూడి

డైవర్షన్ రోడ్డు నిర్మించాలి



మా ప్రాంతం నుంచి వ్యవసాయం, వ్యాపారాల నిమిత్తం నిత్యం లింగపాలెం మండలం రంగాపురం, ఆసన్నగూడెం, వేములపల్లి ప్రాంతాలకు ఈ వంతెన దాటి వెళుతుంటాం. ఈ ఏడాది కురిసిన వర్షాలతో వంతెన పూర్తిగా కుంగిపోయింది. వంతెనపై నుంచి, వాహనాలు వెళ్లాలంటే ప్రమాదకరంగా మారింది. అధికారుల స్పందించి వంతెన నిర్మాణం చేపట్టే వరకు డైవర్షన్ రోడ్డు నిర్మించాలి.

– నౌడు వెంకట అప్పారావు, రైతు, కళ్లచెరువు

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	26	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	44	చిక్కుడు కాయలు	80
వంకాయలు (కాంతులు)	48	బీక్షదిక్కుడు	00
వంకాయలు (తెలుపు)	00	చామదుంపలు	38
బెండకాయలు	22	ములక్కాడలు	10, 15
పచ్చిమిర్చి	48	కంద	00
కాకర కాయలు	36	బీట్‌రూట్	40
బీరకాయలు	30	కీరా దోస	40
బీరకాయలు (పందిరి)	40	ఫ్రెంచ్‌బీన్స్	80
క్యాబేజీ	26	అల్లం	70-90
క్యారెట్	46	కొత్తిమీర (కట్ట)	30
దొండకాయలు	38	పాలకూర	10
బంగాళదుంపలు	32	తోటకూర	10
ఉల్లిపాయలు	24	చుక్కకూర	10
గోరుచిక్కుడు	46	గోంగూర	07-10
దోసకాయలు	28	పుదీనా	05
అనబకాయ (1)	30	క్యాప్సికమ్	80
పొట్లకాయ(1)	20	చిలకదదుంప	48

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	00
ఏలూరు - జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	01
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	01
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	00
ఏలూరు - అమరావతి (ఇంద్ర)	19.00	రద్దు

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	01
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.15	4822	00
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	00
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	10.45	4798	00
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	21.15	4802	00
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	02
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	00
ఏలూరు - తిరుపతి	16.00	4830	24

దీపావళికి అనుమతులు తప్పనిసరి



దెందులూరు ఎస్ఐ ఆర్. శివాజీ

దెందులూరు: లైసెన్సు లేకుండా మందు గుండు తయారీ అమ్మకాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని దెందులూరు ఎస్సై రాచమల్లు శివాజీ అన్నారు. శనివారం దెందులూరు పోలీస్‌స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ దీపావళి సామగ్రి అమ్మే గోడౌన్లు షాపులు జన సమూహానికి దూరంగా ఉంచాలన్నారు. ఫైర్ సేఫ్టీ చర్యలు విక్రయిదారులందరూ తప్పనిసరిగా పాటించాలన్నారు. మైనర్లను పనులకు వినియోగించకూడదని సూచించారు. ప్రతి షాపులో లైసెన్సును ముందుగా ప్రదర్శించాలన్నారు. అనుమతి పొందిన వారు మాత్రమే విక్రయాలు అధికారులు సూచించిన సమయంలో అమ్మాలన్నారు. దీపావళి రోజు సాయంత్రం ఐదు తర్వాత అమ్మకాలు నిషేధించడం జరిగిందని మండలంలో లైసెన్స్ పొందిన విక్రయదారులు విక్రయాలు షాపుల్లో నిబంధనల అమలుపై రెవెన్యూ, పోలీస్ శాఖ పర్యవేక్షణ విధిగా ఉంటుందని ఎస్ఐ అన్నారు. ఎవరైనా అక్రమంగా బాణసంచా నిల్వలు చేస్తే వెంటనే సమాచారం పోలీస్‌స్టేషన్‌కు 9440796654, పోలీస్ కంట్రోల్ రూమ్ నెంబరు 8332959175కు తెలియజేయాలని సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఎస్ఐ అన్నారు.

ప్రతి విద్యార్థికీ చట్టాలపై అవగాహన అవసరం



కార్యక్రమంలో మాట్లాడుతున్న రత్న ప్రసాద్

పెదవేగి : ప్రతి విద్యార్థికీ చట్టాలపై పూర్తి అవగాహన ఉండాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్ అన్నారు. మండలంలోని లక్ష్మీపురం పంచాయతీ ఎంఆర్‌సీ కాలనీలోని జవహర్ నవోదయ పాఠశాలను న్యాయసేవాధికార బృందం శనివారం సందర్శించారు. పాఠశాల వసతి గృహంలో విద్యార్థులకు అందజేస్తున్న ఆహార పదార్థాల నాణ్యత, పరిశుభ్ర, మంచినీటి సౌకర్యాలు, వైద్య సదుపాయాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో విద్యార్థులు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారని, విద్యార్థులు చదువుతోపాటు ఇతర సాంస్కృతి కార్యక్రమాల పైన దృష్టి సారించి ఒత్తిడిని తొలగించుకోవడానికి తెలిపారు. కార్యక్రమంలో ఏలూరు రెండో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కుమారి స్పందన, పాలకొల్లు అదనపు సివిల్ జడ్జి పీవీఎస్ఎన్ లక్ష్మి లావణ్య, తణుకు రెండో అదనపు సివిల్ జడ్జి కె.కృష్ణవేణి, నిడదవోలు జడ్జి షేక్ ఖవాజా రహిమాన్ పాల్గొన్నారు.

యువకుడికి విద్యుత్ షాక్

కామవరపుకోట: విద్యుత్ షాక్‌కు గురై యువకుడుకి తీవ్ర గాయాలైన ఘటన ఆడమిల్లి గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. బంధువులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆడమిల్లికి చెందిన బోనల వంశీ స్థానిక విద్యుత్ లైన్‌మెన్ వద్ద ప్రైవేట్ సహాయకునిగా పని చేస్తున్నాడు. శనివారం ఉదయం గ్రామంలో మద్దుకూరి సమీపంలో విద్యుత్ స్తంభం ఎక్కి పని చేస్తూ ఉండగా ఒక్కసారిగా సరఫరా రావడంతో షాక్ గురై మంటల చెలరేగి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వంశీని ఏలూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. ప్రస్తుతం వంశీ ఆరోగ్యం విషమంగా ఉందని తెలిపారు. అయితే విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం వల్లే ఈ ఘటన జరిగిందని, గతంలో ఇలాంటి ఘటనలు మండలంలో జరిగిన సందర్భాలు చాలా ఉన్నాయని పలువురు ఆరోపిస్తున్నారు.

వ్యాయామ పరికరాల వితరణ

కొయ్యలగూడెం: స్థానిక వృద్ధాశ్రమంలో వ్యాయామ పరికరాలను డాక్టర్ నరహరిశెట్టి సతీష్ శనివారం ప్రారంభించారు. వృద్ధులు వ్యాయామం చేయడానికి అనువుగా ఉండే పరికరాలను ముళ్లపూడి సత్యనారాయణ సుజాత దంపతులు కృషితో దాతల నుంచి సేకరించిన రూ.లక్షతో కొనుగోలు చేశామని ఆశ్రమ నిర్వాహకులు మాజేటి అప్పలరాజు, మాజేటి సత్యనారాయణ తెలిపారు. ఈ పరికరాలను ఉపయోగించే విధానంపై దంపతులు కొద్ది రోజులపాటు శిక్షణ ఇస్తారన్నారు. సెలవు దినాల్లో చిన్నారులు ఆటవిడుపు కోసం పరికరాలను కూడా ఏర్పాటు చేశామన్నారు. సురక్ష హాస్పిటల్ డాక్టర్ దిలీప్ కుమార్, లలిత ప్రియ హాస్పిటల్ డాక్టర్ రాజశేఖర్, సాయి ఎమర్జెన్సీ హాస్పిటల్ డాక్టర్ పి.రాజశేఖర్, రోటరీ క్లబ్ సభ్యులు సహాయ సహకారాలు అందజేశారు.

రేపు జాతీయ ఎస్టీ కమిషన్ మోదేలు సందర్శన



గిరిజనులతో మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటేశ్వరరావు

బుట్టాయగూడెం: అభయారణ్యంలో ఉన్న మోదేలు గ్రామానికి మంజూరైన రోడ్డు, విద్యుత్ సదుపాయం ఏర్పాటుకు ఫారెస్ట్ అధికారులు అభ్యంతరాలు చెప్పడంతో ఆ గ్రామ గిరిజనులు ఢిల్లీలోని జాతీయ ఎస్టీ కమిషన్‌కు లేఖ రాశారు. ఈ నేపథ్యంలో ఈ నెల 6వ తేదీన మోదేలు గ్రామాన్ని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు సందర్శించనున్నారు. దీంతో గ్రామస్తులు సుమారు 5 కిలో మీటర్ల మేర రహదారిని శ్రమదానంతో బాగు చేశారు. శనివారం పోలవరం డీఎస్పీ వెంకటేశ్వరరావు మోదేలు గ్రామాన్ని సందర్శించారు. డీఎస్పీ, పోలీస్ సిబ్బంది లంకపాకల వరకు జీపుల్లో, వాహనాలు వెళ్లేందుకు అనుకూలంగా రోడ్డు లేకపోవడంతో లంకపాకల నుంచి ద్విచక్ర వాహనాలపై మోదేలు గ్రామం చేరుకున్నారు. డీఎస్పీ గిరిజనుల ఆరోగ్య స్థితిగతులపై ఆరా తీశారు. ఆరోగ్యాలపై శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. పిల్లలకు బిస్కెట్లు పంపిణీ చేశారు. పిల్లలను చదివించాలని తల్లిదండ్రులను సూచించారు. టి.నర్సాపురం, వేలేరుపాడు ఎస్సైలు ఎం జయబాబు, ఐ.నవీన్‌కుమార్, బుట్టాయగూడెం స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ కృష్ణంరాజు, రైటర్ రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలను కూల్చివేయాలి



కుక్కునూరులో సమావేశమైన ఆదివాసీ నాయకులు

కుక్కునూరు: ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనేతరులు చేపట్టిన అక్రమ కట్టడాలను కూల్చివేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం ఆదివాసీ సంక్షేమ పరిషత్, ఆదివాసీ విద్యార్థి సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసీల ప్రత్యేక హక్కులను పాలకులు, అధికారులు అమలు చేయడంలేదని ఆరోపించారు. అక్రమ కట్టడాలను అడ్డుకోకపోవడం దారుణమన్నారు. పోలవరం ముంపు భూసేకరణలో కూడా గిరిజనేతరులు ఆదివాసీ భూములను కబ్జాచేసి తప్పుడు పద్ధతుల్లో పోలవరం నష్టపరిహారం పొందారని ఆరోపించారు. అధికారులు కమీషన్లకు కక్కుర్తిపడి కోట్ల రూపాయల ప్రభుత్వ ధనాన్ని గిరిజనేతరులకు దోచి పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివాసీ చట్టాల అమలులో పాలకులు విఫలమవుతున్నారని దుయ్యబట్టారు. సమావేశంలో నాయకులు సరియం ప్రసాద్, పొడియం వేణు, పైదా బుర్రయ్య, బిట్ట శివలింగయ్య, జెట్టి రఘుబాబు, పైదా చిన్నబాబు, కూరం ప్రసాద్, తుర్సం నరసింహారావు, వెలకం అశోక్‌కుమార్, కుంజా ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.